క్లుప్తంగా

108 సేవలు ప్రారంభం



కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌ను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మారుమూల గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఇనుగుర్తిలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. డీఎంహెచ్‌ఓ మురళీధర్, మెడికల్ ఆఫీసర్ సురేష్, 108 ప్రోగ్రాం మేనేజర్ నాగేందర్, జిల్లా మేనేజర్ మహేష్, సతీష్, అశోక్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కురవి : మండల కేంద్రంలోని నాగార్జున హైస్కూల్‌కు చెందిన భూక్య సుజిత్ రాష్ట్రస్థాయి ట్రాతలన్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బి.రవి బుధవారం తెలిపారు. సీఎం కప్ టోర్నమెంట్‌లో విద్యార్థి సుజిత్ అత్యంత ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

సన్మానం



గూడూరు : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్‌ను బుధవారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య మాట్లాడుతూ కోతుల బెడదను నియంత్రించడానికి ప్రజా సేవకుడిగా సొంత డబ్బులు రూ.8 లక్షలు వెచ్చించి కోతులను పట్టించడం సంతోషకరమన్నారు. యాకయ్య, మహిపాల్, రాములు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సై రియాజ్‌పాషాకు..

గార్ల : ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కే రియాజ్‌పాషాను బుధవారం మండల ఫెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

దుప్పట్లు, ఆహారం పంపిణీ

మరిపెడ రూరల్ : మరిపెడ బస్టాండ్‌లో చలికి వణుకుతున్న వృద్ధ దంపతులను స్థానికులు గమనించి కేకే ఇన్‌ఫ్రా ఖలీల్ బ్రదర్స్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు స్పందించి అనుచరుల ద్వారా వృద్ధులకు దుప్పట్లు, ఆహారం అందించారు.

దైవకృప వృద్ధుల ఆశ్రమంలో..



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండా దైవకృప వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులు, నిరాదరణకు గురైన పిల్లలకు బుధవారం దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టాటా ఏఐఏ మేనేజర్ జక్కుల సతీష్ మాట్లాడుతూ ఈ నెల 28న రతన్ టాటా పుట్టినరోజును పురస్కరించుకుని వృద్ధులు, పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. వైద్యులు రాము, విజయ, ఆశ్రమ వ్యవస్థాపకులు బానోత్ లోకేష్, టాటా ఏఐఏ లీడర్లు వీరన్న, వెంకన్న, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు..



క్రిస్మస్ సందర్భంగా సినీనటుడు రాజమౌళి పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్, శ్రీనివాస సెంటర్, బస్టాండ్, నెహ్రూసెంటర్ ప్రాంతాల్లో నిరుపేదలకు దుప్పట్లు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. గుండెల రాజు, శంతన్ రామరాజు, రాజమౌళి సతీమణి సావిత్ర, భానుశ్రీ, రాఘవేంద్ర, పద్మ, వెంకన్న పాల్గొన్నారు.

నకిలీ మిర్చి విత్తన డీలర్లపై చర్యలకు ఆదేశం

గార్ల : మిర్చి నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ రైతు సంక్షేమ చైర్మన్ కోదండరెడ్డి సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని కేశోత్‌తండా గిరిజన రైతులు ఖమ్మంలోని గాంధీచౌక్‌లో గల సీడ్స్ దుకాణంలో మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి మిర్చితోట సాగు చేశారు. ప్రస్తుతం ఈ తోట కాపుదశకు రాగా, మిర్చికాయలు సన్నగా కాయాల్సి ఉండగా, లావుగా ఉన్నాయని మిర్చి సాగు చేసిన రైతులు రెండురోజుల క్రితం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గార్ల వ్యవసాయ అధికారిని సాక్షి వివరణ కోరగా ఆదేశాలు వచ్చినట్లు తెలిపిందన్నారు.



తొర్రూరు రూరల్: హరిపిరాల చర్చిలో క్రిస్మస్ వేడుకలు



నెల్లికుదురు: ఇంటీరియల్ బాప్టిస్టు చర్చిలో..



బయ్యారం: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



తొర్రూరు: సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యేసు బోధనలు మానవాళికి ఆచరణీయమని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గార్ల: క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, క్రైస్తవులు



కేసముద్రం: క్రిస్మస్ వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్ రూరల్: పాస్టర్ దంపతులను సన్మానిస్తున్న గుగ్గిళ్ల పీరయ్య, తదితరులు



గూడూరు సీఎస్ఐ చర్చిలో..



మరిపెడ: పరమ గురు ప్రార్థన మందిరంలో..



పెద్దవంగర చర్చిలో కేక్‌కట్ చేస్తున్న పాస్టర్



దోర్నకల్: మాట్లాడుతున్న పాస్టర్ రబ్బాని



కురవి: నృత్యం చేస్తున్న చిన్నారులు



నెహ్రూసెంటర్: క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ మోజెస్, సంఘ సభ్యులు



మహబూబాబాద్ రూరల్: చిన్నారుల నృత్యప్రదర్శన

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్/గూడూరు: అయ్యప్ప స్వామి ఆశీర్వాదంతో నియోజకవర్గ రైతులు, అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండల పూజల ముగింపులో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చన పూజ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకుని పుష్పాలు సమర్పించారు. హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి అనుగ్రహంతో అందరికి మేలు కలగాలని వేడుకున్నారు.అలాగే గూడూరు మండలంలోని కొబల్‌తండా అయ్యప్పస్వామి శరణుఘోషతో మార్మోగింది. అయ్యప్ప అభిషేక, అష్టోత్తర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

పెద్దవంగర : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని డీఎస్పీ కృష్ణ కిషోర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్సై క్రాంతికిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో తప్పకుండా తనిఖీలు చేపట్టాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని తెలిపారు. ఏదైన సమస్యతో ఫిర్యాదు తీసుకొని స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవరిస్తూ వారికి సత్వర న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. సిబ్బందికి ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి గాని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐ జగదీష్, ఏఎస్సై విజయరాజు, కానిస్టేబుల్స్ వెంకటయ్య, సుధాకర్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

అజాతశత్రువు అటల్ బిహారీ వాజ్‌పేయి



మహబూబాబాద్ అర్బన్: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీతారాం నాయక్ తదితరులు

● మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్

మహబూబాబాద్ అర్బన్ : మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి దేశగతిని మార్చిన అజాత శత్రువు అని మాజీ ఎంపీ ప్రొఫెసర్ డాక్టర్ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సీతారాంనాయక్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మోసంగి మురళి, హిందూభారతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి అడుగుజాడల్లో నడవాలి

గూడూరు : మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి అడుగుజాడల్లో నడవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న అన్నారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. నాయకులు రాంబాబు నాయక్, మేరెడ్డి సురేందర్, సమ్మెట సుధాకర్, మేరుగు మల్లయ్య, రాసమల్ల వెంకటేశ్వర్లు, ఎలుగం రవి, జనార్దన్,ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘన నివాళి

కొత్తగూడ : మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజపేయి శత జయంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.ఆ పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు మధు, రవి, అశోక్ పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు వాజ్‌పేయి

దంతాలపల్లి : దేశ రాజకీయ నాయకుల్లో మచ్చలేని నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని సెంట్రల్ ఫిలిం సెన్సార్ ప్యానల్ బోర్డు సభ్యుడు మహేష్ అన్నారు. మండల కేంద్రంలో బధవారం మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని నిర్వహించారు. పూర్ణచందర్ రెడ్డి, సారెడ్డి రాణి రెడ్డి, చిన్నల ప్రవీణ్, గుండగాని భరత్, తూర్పటి శేఖర్,ఎల్లు దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.



గూడూరు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



కొత్తగూడలో..

తొర్రూరు : మాజీ ప్రధాని, దివంగత వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, రంగు రాములు, రచ్చ కుమార్, బి.సురేష్, గట్టు రాంబాబు, కాగు నవీన్, పైండ్ల రాజేష్‌పాల్గొన్నారు.

సేవలు ఆదర్శప్రాయం

పెద్దవంగర : దివంగత నేత మాజీ ప్రధాని ఆటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు ఆదర్శప్రాయమని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల గ్రామంలో వాజపేయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి వెంకటనారాయణ, వెంకన్న, మల్లయ్య, బిక్షపతి, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి



నెహ్రూసెంటర్ : ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. విలీన సభ పోస్టర్లను బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. బండారి ఐలయ్య, హలావత్ లింగన్న, నందగిరి వెంకటేశ్వర్లు, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, బట్టు చైతన్య, బోనగిరి మధు, తెల్లబోయిన లక్ష్మయ్య, పర్వత కోటేష్, ఎండి. జబ్బార్, కృష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మరిపెడ : ఆకేరు, పాలేరు వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ డి.సైదులు, ఎస్సై సతీష్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింహులపేట తహసీల్దార్ సీహెచ్ నాగరాజుతో కలిసి వారు మాట్లాడారు. అనుమతి లేకుండా మరిపెడ, నర్సింహులపేట, చిన్నగూడూరు మండలాల పరిధిలోని ఆకేరు, పాలేరు వాగుల నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తే రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏఈని సంప్రదించి ఎన్ని ట్రిప్పుల అవసరం ఉందో రెవెన్యూ శాఖలో దరఖాస్తు చేసుకునేలా వీలు కల్పించడం జరుగుతుందన్నారు.

అంజన్న స్వాముల శోభాయాత్ర

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని రజాలిపేట శివారు టేకుల తండాకు చెందిన పలువురు అంజన్న స్వామివారి దీక్ష స్వీకరించిన స్వాములు బుధవారం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి కొండగట్టుకు తరలివెళ్లారు.

సంక్షిప్త సమాచారం

మంగళహారతులతో స్వాగతం

మహబూబాబాద్ రూరల్ : ధనుర్మాస ఉత్సావల్లో పూజల్లో భాగంగా వేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి,కృష్ణుడికి మహబూబాబాద్ పట్టణంలోని శ్రీరామ ఆలయంలో భక్తులు బుధవారం మంగళహారతులతో పూజలు చేసి స్వాగతం పలికారు.

విహారయాత్రతో అవగాహన

దంతాలపల్లి : వేములపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు విహారయాత్రకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు కట్టడాలు వాటి చరిత్ర, నిర్మాణం తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చెక్కుల పంపిణీ



మరిపెడ/ మరిపెడ రూరల్ : జమ్మికుంట తండాకు చెందిన మంగిలాల్‌కు రూ.60 వేలు, సునీతకు రూ.32 వేలు, రవికి రూ.25 వేలు సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరు కాగా బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి పంపిణీ చేశారు. నాయకులు గుగులోత్ రవి, అఫ్జల్, గండి వీరభద్రం, కుడితి నర్సింహారెడ్డి, రఘునందన్‌రెడ్డి, బుర్ర నవీన్, భావ్‌సింగ్, బుచ్చిబాబు, రవి, భోజ్యా, నరేష్, పాల్గొన్నారు.

మద్యంమత్తులో డ్రైవర్.. మేకల మందపై దూసుకువచ్చిన ట్యాంకర్

కొత్తగూడ : మద్యం మత్తులో ట్యాంకర్ లారీని డ్రైవింగ్ చేస్తూ మేకల మందపైకి దూసుకువచ్చాడు. దీంతో తప్పించుకునేందుకు స్పీడ్‌గా వెళ్తూ ఖానాపురంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలంలోని పేపర్ ఫ్యాక్టరీలో కెమికల్ అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తున్నాడు.ఈ క్రమంలో కొత్తగూడ-నర్సంపేటకు వెళ్లే ప్రధాన రహదారి గాదె వాగు సమీపంలో గాంధీనగర్‌కు చెందిన రైతు సమ్మయ్య మేకల మందను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒక మేక చనిపోగా, రెండు మేకల కాళ్లు విరిగాయి. రైతు లారీ ఆపే ప్రయత్నం చేయగా స్పీడ్ తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఖానాపురం మండలం చిలకమ్మ నగర్ సమీపంలో ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో గ్రామస్తులు ట్యాంకర్‌లారీని ఆపి డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఆటో టైరులో ఇరుక్కుపోయిన కోతి బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలు

బయ్యారం: రోడ్డుపై వెళ్తున్న ఆటో ముందు టైరులో కోతి ఇరుక్కుపోవడంతో ఆ వాహనం బోల్తా పడిన ఘటన బుధవారం మండలంలోని ఇల్లెందు–మహబూబాబాద్ రహదారిపై జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గార్ల మండలం మద్దివంచకు చెందిన యాకూబ్‌పాషా తన ఆటోలో గార్ల నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బయ్యారం సమీపంలోని అలిగేరు బ్రిడ్జి సమీపంలో కోతి ఒక్కసారిగా ముందుటైరులో ఇరుక్కుపోయింది. దీంతో స్టీరింగ్ తిరగకపోవటంతో ఆటో బోల్తా పడింది. ఈ సమయంలో ఆటో తోలుతున్న యాకూబ్‌పాషాతో పాటు గార్ల మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన రుక్మిణి, ముల్కనూరుకు చెందిన పందుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అకాల వర్షం.. రైతులు ఆగమాగం



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

మహబూబాబాద్ రూరల్ : అకాల వర్షంతో మహబూబాబాద్ మండలంలోని పలుగ్రామాల్లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం చిరు జల్లులతో కూడిన వర్షం కురుస్తుండగా ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి జాగ్రత్త పడుతున్నారు. అయినా కొన్నిచోట్ల ధాన్యం రాశుల సమీపంలో వర్షపు నీరు నిలిచింది.

రైతుల ఆందోళన

కొత్తగూడ : మండలంలో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు నింపి కాంటా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

కేసముద్రం : కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో బుధవారం కురిసిన అకాలవర్షంతో పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, బస్తాలు స్వల్పంగా తడిచాయి. అర్ధరాత్రి వర్షం ఎక్కువ కావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు, పరదాలు కప్పుకున్నప్పటికీ బస్తా అడుగులు తడిశాయి.

తడుస్తున్న ధాన్యం

డోర్నకల్ : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆరబెట్టగా అకాల వర్షం కారణంగా తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు 2,250 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా 1,254 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లులకు తరలించగా 1,254 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది. వెంటనే తరలించాలని కోరుతున్నారు.

వర్షంతో రైతుల్లో పరేషాన్

బయ్యారం : మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వారంరోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టిన బస్తాలకు ఆర్వోలు రాకపోవటంతో వేలాదిబస్తాలు పేరుకుపోయాయి.

నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు..

చిన్నగూడూరు : వానాకాలం ధాన్యం కొనుగోలు కోసం మండలవ్యాప్తంగా నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా..గుండంరాజుపల్లి, జయ్యారం, విస్సంపల్లి గ్రామాల్లో ధాన్యం సేకరణ జరుగుతున్నాయి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ మూడు రోజులుగా నిలిచిపోయాయి. మండలవ్యాప్తంగా 18,963 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, 3,722 క్వింటాళ్ల ధాన్యం కాంటా వేసి మిల్లులకు తరలించడానికి సిద్ధంగా ఉన్నాయి.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

గార్ల : అకాల వర్షం కురవడంతో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కల్లాల్లో ఆరబోయడంతో తడిసిపోయింది. రైతులు ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుకుంటూ నానా ఇబ్బందులు పడుతున్నారు. తడిసిన ధాన్యంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందికొడి ధాన్యం కొనుగోళ్ల నడుస్తుండటంతో ఇప్పటి వరకు కేవలం సగం మాత్రమే ధాన్యం కొనుగోళ్లు జరిగాయని రైతులు పేర్కొన్నారు. అదే విధంగా తడిసిన ధాన్యం సైతం ఎలాంటి షరతులు పెట్టకుండా కొనుగోలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



బయ్యారం: కొనుగోలు కేంద్రంలో..



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు వెంకన్న